
సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
శుక్రవారం । 9 । ఫిబ్రవరి । 2024



సోమశిలలో 23.42 టీఎంసీలు
సోమశిల: జలాశయంలో గురువారానికి 23.42 టీఎంసీల నీరు నిల్వ ఉంది. పెన్నార్ డెల్టా, ఉత్తర, దక్షిణ, కావలి కాలువలకు 3,500 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.64,450
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.5,788
మూడు శాతం జీఎస్టీతో	రూ.5,961
నవర (8 గ్రాములు)	రూ.47,688

గరిష్టం/కనిష్టం
33.5 /23.1

వాతావరణం
గురువారం గాలిలో తేమ 66 శాతం ఉంది. ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతున్నాయి. శుక్రవారం పెద్దగా మార్పులు ఉండబోవని వాతావరణ శాఖ తెలిపింది.

న్యూస్‌రీల్

రెవెన్యూ అంశాలపై ప్రత్యేక దృష్టి



వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన కలెక్టర్

నెల్లూరు(దర్గామిట్ట): జిల్లాలో చుక్కల.. అసైన్‌మెంట్ భూముల కేటాయింపు, రీ సర్వే తదితర రెవెన్యూ అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ జవహర్‌రెడ్డి ఆదేశించారు. చుక్కల.. అసైన్‌మెంట్ భూముల పంపిణీ, రీ సర్వే, జగనన్న ఇళ్ల నిర్మాణాలు, పోలింగ్ కేంద్రాల్లో వసతుల కల్పన తదితర అంశాల్లో పురోగతి, చేపట్టాల్సిన చర్యలపై అన్ని జిల్లాల కలెక్టర్లతో అమరావతి నుంచి వర్చువల్‌గా గురువారం ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పలు సూచనలు చేశారు. వీడియో కాన్ఫరెన్స్‌కు కలెక్టరేట్ నుంచి కలెక్టర్ హరినారాయణన్, జేసీ రాజేంద్రన్, వివిధ శాఖల అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా జవహర్‌రెడ్డి మాట్లాడారు. జిల్లాలో చుక్కల.. అసైన్‌మెంట్ భూముల పంపిణీపై ప్రత్యేక దృష్టి సారించి త్వరగా పూర్తి చేయాలని సూచించారు. నవరత్నాలు పేదలందరికీ ఇళ్ల నిర్మాణాలపై పొదుపు సంఘాల్లోని మహిళలకు రూ.35 వేల అదనపు రుణాన్ని మంజూరు చేసి నిర్మాణాల్లో వేగం పెంచాలని చెప్పారు. పరిశ్రమల శాఖ జీఎం సుధాకర్, డ్వామా పీడీ వెంకట్రావ్, సర్వే ల్యాండ్ రికార్డ్స్ ఏడీ హనుమాన్‌ప్రసాద్, డీఎంహెచ్‌ఓ పెంచలయ్య, ఆరోగ్యశ్రీ కో ఆర్డినేటర్ చంద్రశేఖర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ రంగవరప్రసాద్, హౌసింగ్ పీడీ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో ఖాళీగా 151 ఉపాధ్యాయ పోస్టులు

నెల్లూరు(టౌన్): జిల్లాలో 151 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయని జిల్లా విద్యాశాఖ అధికారులు లెక్కతేల్చారు. ఈ పోస్టులు స్కూలు అసిస్టెంట్లకు సంబంధించినవే. సెకండరీ గ్రేడ్ టీచర్ల విభాగంలో ఒక్క పోస్టు కూడా ఖాళీ లేదని తేల్చారు. అయితే రోస్టర్ పాయింట్ల కేటాయింపులో ఈ పోస్టుల సంఖ్య స్వల్పంగా పెరగడమో లేక తగ్గేందుకో అవకాశముంది. డీఎస్సీ ప్రకటనతో నిరుద్యోగుల్లో ఆశలు రేకెత్తాయి.

సజావుగా ప్రాక్టికల్స్ నిర్వహణ



సమావేశానికి హాజరైన ప్రిన్సిపల్స్, ఎగ్జామినర్లు

నెల్లూరు(టౌన్): ఇంటర్ ప్రాక్టికల్స్‌ను సజావుగా నిర్వహించాలని డీఆర్వో లవన్న పేర్కొన్నారు. నగరంలోని డీకేడబ్ల్యూ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపల్స్, చీఫ్ సూపరింటెండెంట్లు, ఎగ్జామినర్లతో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రాలను సందర్శించి పరీక్షల నిర్వహణకు అన్ని చర్యలు చేపడుతున్నామని వివరించారు. అనంతరం పరీక్ష కేంద్రాల ఏర్పాటు.. పరీక్షల నిర్వహణ.. కొత్తగా వచ్చిన మార్పులను ఆర్‌ఐఓ శ్రీనివాసులు వివరించారు. డీఈసీ సభ్యులు దీన్‌దయాళ్, వేణుగోపాల్, కొండయ్య, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి తలెత్తకూడదు



పరిశీలిస్తున్న కన్నమనాయుడు

ఇందుకూరుపేట: రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకొని తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని జెడ్పీ సీఈఓ కన్నమనాయుడు పేర్కొన్నారు. మండలంలోని ముదివర్తిపాళెంలో సమగ్ర రక్షిత నీటి సరఫరా పథకాన్ని గురువారం ఆయన పరిశీలించారు. ప్రజలకు సరఫరా చేస్తున్న మంచినీటి శుభ్రతను తనిఖీ చేశారు. ఓహెచ్‌ఎస్‌ఆర్ ట్యాంక్ పంప్ హౌస్‌ను పరిశీలించారు. ఎంపీడీఓ నాగరాజు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ హజరత్ తదితరులు పాల్గొన్నారు.

10కి పక్కా ప్రణాళిక

అభ్యసనాభివృద్ధి పేరిట రోజూ పర్యవేక్షణ తరగతులు

పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాల సాధనే లక్ష్యంగా జిల్లా విద్యాశాఖ ప్రత్యేక దృష్టి సారించింది. విద్యార్థుల్లో సామర్థ్యాన్ని పెంచి అత్యుత్తమ ఫలితాలను సాధించడమే లక్ష్యంగా 85 రోజులు పాటు అభ్యసనాభివృద్ధి పేరిట కార్యక్రమాన్ని రూపొందించారు. డిసెంబర్‌లోనే సిలబస్‌ను పూర్తి చేసి విద్యార్థులకు పునశ్చరణ తరగతులను నిర్వహిస్తున్నారు. రోజూ ప్రత్యేక తరగతులతో పాటు సబ్జెక్టుల వారీగా పరీక్షలను నిర్వహించి విద్యార్థులను సన్నద్ధం చేస్తున్నారు.

- మ్యాథ్స్, ఇంగ్లిష్‌లో 22.. మిగిలిన సబ్జెక్టుల్లో 11 భాగాలు
- ఉదయం, సాయంత్రం పరీక్షలు
- వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి
- ఈ నెల 23 నుంచి ప్రీ పబ్లిక్.. మార్చి 18 నుంచి పబ్లిక్ పరీక్షలు
- జిల్లాలో 26 వేల మందికిపైగా హాజరు



రోజువారీ పరీక్షలకు హాజరైన పదో తరగతి విద్యార్థులు (ఫైల్)

నెల్లూరు(టౌన్): పదిలో అత్యధిక మార్కులు తెచ్చుకునేలా విద్యార్థులను తీర్చిదిద్దుతున్నారు. దీని కోసం షెడ్యూల్‌ను ప్రకటించారు. ఉత్తీర్ణత శాతాన్ని పెంచడమే లక్ష్యంగా ప్రతి పాఠశాల ప్రధానోపాధ్యాయులతో పాటు ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకునేలా ప్రణాళికను రూపొందించారు. వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారికి ప్రత్యేక తర్ఫీదును ఇచ్చేలా నిర్ణయం తీసుకున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక మెటీరియల్‌ను జెడ్పీ ఆధ్వర్యంలో ఏటా అందజేస్తున్నారు.

26 వేల మందికిపైగా 'పది' విద్యార్థులు

జిల్లాలో 335 ప్రభుత్వ యాజమాన్య పాఠశాలలు, మరో 360కు పైగా ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలున్నాయి. ప్రైవేట్ పాఠశాలల్లో 11 వేలు.. ప్రభుత్వ పాఠశాలల్లో 15 వేల మందికిపైగా విద్యార్థులు పదో తరగతి చదువుతున్నారు. వీరందరూ పదిలో మెరుగైన ఫలితాలను సాధించడమే లక్ష్యంగా జిల్లా విద్యాశాఖ ప్రత్యేక ప్రణాళికను రూపొందించింది.

ప్రత్యేక శ్రద్ధ

అభ్యసనాభివృద్ధి కార్యక్రమం పేరిట విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. డిసెంబర్ 22 నుంచి ఫిబ్రవరి 22 వరకు.. మార్చి నాలుగు నుంచి 17 వరకు రెండు దశల్లో అభ్యసనాభివృద్ధి కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారు. ఈ నెల 23 నుంచి వచ్చే నెల నాలుగు వరకు ప్రీ పబ్లిక్.. మార్చి 18 నుంచి పబ్లిక్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. డిసెంబర్ నాటికే సిలబస్‌ను పూర్తి చేశామని జిల్లా విద్యాశాఖ అధికారులు చెప్తున్నారు.

సన్నద్ధమిలా..

పదో తరగతిలో ఉత్తమ ఫలితాలను సాధించే దిశగా జిల్లా విద్యాశాఖ అధికారులు ప్రత్యేక ప్రణాళికను రూపొందించారు. ఈ షెడ్యూల్‌ను ప్రతి ప్రభుత్వ యాజమాన్య పాఠశాలలో ప్రధానోపాధ్యాయులతో పాటు ఉపాధ్యాయులు అనుసరించాల్సి ఉంటుంది.

- ప్రతి సబ్జెక్టులో సిలబస్‌ను భాగాలుగా చేసి విద్యార్థులకు పునశ్చరణ తరగతులతో పాటు రోజు వారీ పరీక్షలను నిర్వహిస్తున్నారు.
- మ్యాథ్స్, ఇంగ్లిష్ సబ్జెక్టుల్లో 22 భాగాలు, మిగిలిన సబ్జెక్టుల్లో 11 భాగాలుగా విభజించారు.
- రోజూ ఉదయం 8.15 నుంచి 9.15 వరకు పదో తరగతి విద్యార్థులకు పర్యవేక్షణ తరగతులను నిర్వహిస్తున్నారు.
- ఉదయం 9.15 నుంచి పది గంటల వరకు సబ్జెక్టుల వారీగా పరీక్ష..

ఉదయం పది నుంచి మధ్యాహ్నం 3.15 వరకు తరగతులను నిర్వహించాల్సి ఉంది.

- మధ్యాహ్నం 3.15 నుంచి 4.15 వరకు పర్యవేక్షణ తరగతులను నిర్వహిస్తున్నారు.
- సాయంత్రం 4.15 నుంచి ఐదు గంటల వరకు రోజు వారీ పరీక్షను జరుపుతున్నారు.

ఉపాధ్యాయులతో మూల్యాంకనం

- ప్రశ్నపత్రాన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయులు గంట ముందు డీఈఓ వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకొని ప్రింట్ తీసి విద్యార్థులకు అందజేస్తున్నారు.
- సమాధాన పత్రాలను తరగతి ఉపాధ్యాయులే మూల్యాంకనం చేసి ఫలితాల బట్టి వారికి సూచనలు చేస్తున్నారు.
- రోజు వారీ పరీక్షల అనంతరం ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు కలిసి విద్యార్థులతో సమీక్షను నిర్వహిస్తున్నారు.
- రోజువారీ పరీక్షల్లో విద్యార్థుల ప్రగతిని నమోదు చేసి పాఠశాల రిపోర్టు కార్డును సంబంధిత ఉప విద్యాశాఖ అధికారికి అందజేయాల్సి ఉంటుంది.
- విద్యార్థుల సామర్థ్యాలపై డిప్యూటీ డీఈఓలు వారి డివిజన్లలో టెలి కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించాలి.

ఉత్తమ ఫలితాలే లక్ష్యం

పదో తరగతిలో ఉత్తమ ఫలితాలను సాధించేందుకు అభ్యసనాభివృద్ధి కార్యక్రమాన్ని అమలు చేస్తున్నాం. ఇప్పటి వరకు షెడ్యూల్‌ను ఎంత వరకు పూర్తి చేశారు.. ఇంకా ఏమి చేయాలనే అంశమై సమీక్ష నిర్వహించి మెరుగైన ఫలితాలను సాధించేలా ప్రణాళికను రూపొందిస్తాం. వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారికి ప్రత్యేక తరగతులను నిర్వహించి ఉత్తమ ఫలితాలను సాధిస్తాం.
– రామారావు, డీఈఓ

పోలింగ్ అధికారులకు అవగాహన అవసరం

- కలెక్టర్ హరినారాయణన్



మాట్లాడుతున్న హరినారాయణన్

నెల్లూరు(దర్గామిట్ట): త్వరలో జరగనున్న ఎన్నికల ప్రక్రియపై అధికారులు పూర్తి అవగాహన కలిగి.. విధులను సమర్థంగా నిర్వర్తించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హరినారాయణన్ పేర్కొన్నారు. కలెక్టరేట్లోని తిక్కన ప్రాంగణంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారులు, నియోజకవర్గ స్థాయి మాస్టర్ ట్రెయినర్లకు నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమంలో గురువారం ఆయన మాట్లాడారు. పొరపాట్లు జరగకుండా చూడటమే ప్రధాన బాధ్యత అని చెప్పారు. ఈవీఎంలకు సీల్ మొదలుకొని మాక్ పోలింగ్ వరకు చాలా మార్పులొచ్చాయని, వీటిని క్షుణ్ణంగా అర్థం చేసుకోవాలని కోరారు. మాస్టర్ ట్రెయినర్లు పోలింగ్ విధులను పూర్తిగా అర్థం చేసుకొని సిబ్బందికి శిక్షణ ఇవ్వాలని సూచించారు. అనంతరం పోలింగ్ విధులు, ఈవీఎంల పనితీరు, వినియోగం, వీవీప్యాట్లు, కంట్రోల్ యూనిట్లు, బ్యాలెట్ యూనిట్ల పరిశీలన తదితర అంశాలపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా ఎన్నికల శిక్షణ నోడల్ అధికారి, నుడా వీసీ బాపిరెడ్డి వివరించారు. జేసీ ఆదర్శ్ రాజేంద్రన్, డీఆర్వో లవన్న, ఎన్నికల రిటర్నింగ్ అధికారులు వికాస్ మర్మత్, విద్యాధరి, మధులత, మలోల, శీనానాయక్, ప్రేమ్‌కుమార్, నోడల్ అధికారులు కన్నమనాయుడు, సాంబశివారెడ్డి, చందర్, సుస్మిత, సదారావు, తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా ఉండొద్దు



బదిలీపై వచ్చిన సిబ్బందితో డాక్టర్ కృష్ణమౌర్య

కోవూరు: పశుసంవర్ధక శాఖలో సహాయకులుగా బాధ్యతలు స్వీకరించిన వారు విధులపై నిర్లక్ష్యంగా ఉండొద్దని ఆ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ కృష్ణమౌర్య పేర్కొన్నారు. వివిధ మండలాల నుంచి ఐదుగురు పశు సహాయకులు కోవూరు మండలానికి బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా కోవూరులోని శాంతినగర్‌లో గల పశు వైద్యశాల కార్యాలయంలో కృష్ణమౌర్యను గురువారం వారు కలిశారు. శాఖాపరంగా పలు విషయాలపై ఆయన అవగాహన కల్పించారు. తమ పరిధిలో పాడి రైతులు ఎంత మంది ఉన్నారు.. ఎన్ని పశువులున్నాయి.. వాటికి టీకాలు వేశారా.. తదితర అంశాలపై పశు సహాయకులు పూర్తి స్థాయిలో అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రభుత్వ పథకాలను పాడి రైతులకు వివరించి వాటిని సద్వినియోగం చేసుకునేలా చూడాలని సూచించారు. వీఏఏ సజ్జాద్ పాల్గొన్నారు.

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ తరలింపు

నెల్లూరు సిటీ: బాలాజీనగర్‌లోని స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ కార్యాలయాన్ని స్టోన్‌హౌస్‌పేటలోని రేబాలవారివీధికి తరలించారు. పూర్తిస్థాయిలో కార్యకలాపాలను సోమవారం నుంచి నిర్వహించనున్నామని జిల్లా రిజిస్ట్రార్ బాలాంజనేయులు పేర్కొన్నారు. ప్రభుత్వ భవనాన్ని రిజిస్ట్రేషన్ కార్యాలయానికి కేటాయిస్తూ గత డిసెంబర్‌లో ఉత్తర్వులను కలెక్టర్ జారీ చేశారు. ఈ క్రమంలో రేబాల చిన్నపిల్లల హాస్పిటల్‌కు చెందిన భవనానికి మరమ్మతులు చేశారు. దీంతో కార్యాలయాన్ని అందులోకి మార్చారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు



విజేతలతో అధికారులు తదితరులు

ఇందుకూరుపేట: రోడ్డు భద్రత వారోత్సవాలను పురస్కరించుకొని మండలంలోని కొమరిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలను ఆర్టీసీ నెల్లూరు రెండో డిపో ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. విజేతలకు బహుమతులను డిపో మేనేజర్ శివకేశవ్‌యాదవ్, కరిముల్లా అందజేశారు. ప్రధానోపాధ్యాయుడు దశరథరామిరెడ్డి, కంట్రోలర్ గిరిధర్, జలీల్‌బాషా, సూరం వెంకటశేషయ్య తదితరులు పాల్గొన్నారు.

ఫిష్ ఆంధ్రాతో జీవనాధారం



ఫిష్ ఆంధ్రా ద్వారా ఏర్పాటు చేసుకున్న దుకాణం వద్ద షాజహాన్

నవరత్నాల పథకాల్లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలు పలు కుటుంబాలకు జీవనాధారంగా మారుతున్నాయి. ఫిష్ ఆంధ్రా ద్వారా మంజూరైన మొత్తంతో ఆత్మకూరులో దుకాణాన్ని నిరుపేద మైనార్టీ యువకుడు షాజహాన్ పది నెలల క్రితం ఏర్పాటు చేసుకున్నారు. ఇది తన కుటుంబానికి ఎంతో బాసటగా నిలుస్తోందని ఆయన చెప్పారు.

రూ.1.05 లక్షల మంజూరు



ఆత్మకూరులో మెప్మా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పొదుపు సంఘాల సహకారంతో ఫిష్ ఆంధ్రాలో భాగంగా షాజహాన్‌కు పట్టణంలోని కోఆపరేటివ్ బ్యాంక్ ద్వారా రూ.1.05 లక్షల రుణం మంజూరైంది. దీని ద్వారా చేపల ఉత్పత్తులు.. వివిధ మేలు రకాల చేపల విక్రయం ద్వారా ఆయన ఆదాయం పొందుతున్నారు. పట్టణంలోని బైపాస్ రోడ్డులో దుకాణాన్ని ఏర్పాటు చేసుకున్నారు. నెల్లూరులో ఐదు నెలల క్రితం ఫిష్ ఆంధ్రా ఉత్పత్తుల క్రయ, విక్రయాలపై శిక్షణ సైతం పొందారు. రోజూ సగటున రూ.వెయ్యి ఆదాయంతో నెలకు రూ.30 వేల వరకు సంపాదిస్తూ భార్యాబిడ్డలను చక్కగా చూసుకోగలుగుతున్నానని ఆయన తెలిపారు. పదో తరగతి వరకు చదివిన తనకు ఇది ఎంతో మేలు చేస్తోందని ఆనందం వ్యక్తం చేస్తున్నారు.
– ఆత్మకూరు రూరల్

అలివి వలలతో కొల్లగొడుతూ..

నిబంధనలకు తిలోదకాలిచ్చి నిషేధిత అలివి వలలతో సోమశిల జలాశయంలో అపార మత్స్య సంపదను కొందరు యథేచ్ఛగా కొల్లగొడుతున్నారు. వీటిని అడ్డుకునేందుకు మత్స్యశాఖ కనీస చర్యలు చేపట్టకపోవడం విమర్శలకు తావిస్తోంది. వేట ఇలాగే కొనసాగితే జాలర్ల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారనుంది.

- సోమశిలలో మత్స్య సంపద దోపిడీ
- నిషేధం ఒట్టి బూటకమే..
- పేద కుటుంబాల జీవనోపాధికి గండి
- పట్టించుకోని మత్స్యశాఖ



నిషేధిత అలివి వలలు

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: అపార మత్స్య సంపద కలిగిన జిల్లా జలనిధి సోమశిల జలాశయంలో నిబంధనలకు తిలోదకాలిచ్చారు. కోట్లాది రూపాయల మత్స్య సంపదను దోచుకుంటున్నా ఆ శాఖ మిన్నకుండిపోతోంది.

700 కుటుంబాలకు జీవనాధారం

సోమశిల జలాశయంలో దాదాపు 700 కుటుంబాలు చేపల వేటనే జీవనాధారంగా చేసుకొని మత్స్యశాఖ మంజూరు చేసిన లైసెన్స్‌లతో జీవనం సాగిస్తున్నారు. వాస్తవానికి జలాశయంలో మత్స్య సంపద అభివృద్ధి కోసం అలివి వలలతో చేపల వేటను నిషేధించారు. అయితే జలాశయ లోతట్టు ప్రాంతాల్లో లక్షలాది రూపాయల విలువజేసే అలివి వలలను ఉపయోగిస్తూ మత్స్య సంపదను కొందరు కొల్లగొడుతున్నారు. గ్రామంలో ముఠా నాయకులు అనుమతి లేకుండా తమిళనాడు, రాజమహేంద్రవరం తదితర ప్రాంతాల నుంచి నకిలీ జాలర్లను తీసుకొచ్చి లోతట్టు ప్రాంతాల్లో స్థావరాలను ఏర్పాటు చేసి మత్స్య సంపదను కొల్లగొడుతున్నారు.

భవిష్యత్తు ప్రశ్నార్థకం

అలివి వలలతో చేపల వేటతో జలాశయంలో ఉండే చిన్న, పిల్ల మత్స్య సంపద తుడిచిపెట్టుకుపోతోంది. దీంతో చేపల వేటే జీవనాధారమైన మత్స్యకార కుటుంబాల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. జలాశయం నుంచి బుట్ట పడవల ద్వారా లోతట్టు ప్రాంతాలకు నకిలీ జాలర్లు వెళ్లి మత్స్య సంపదను నిషేధిత అలివి వలలతో కొల్లగొడుతున్నారు. సమస్యను స్థానిక లైసెన్స్‌డ్ జాలర్లు పలుమార్లు ఉన్నతాధికారులకు తెలియజేసినా అంతర్ జిల్లా సమస్య అంటూ కొట్టిపడేస్తున్నారు.

గతంలో ఎంతో మెరుగు

జిల్లా స్థాయి ఉన్నతాధికారులతో పాటు వైఎస్సార్, అన్నమయ్య జిల్లాల అధికారుల సమన్వయంతో ప్రత్యేక కమిటీని గతంలో ఏర్పాటు చేశారు. అటవీ, పోలీస్, మత్స్య శాఖలు, సోమశిల అధికారులు ప్రత్యేక బృందంగా ఏర్పడి గ్రామంలో ఉండే మత్స్యకారుల ప్రాంతాల్లో ఇంటింటికీ వెళ్లి జల్లెడ పట్టారు. నిషేధిత అలివి వలలను స్వాధీనం చేసుకొని హెచ్చరికలు జారీ చేశారు. దీంతో పాటు సోమశిల జలాశయ లోతట్టుకు వెళ్లే ప్రధాన ద్వారం వద్ద ప్రత్యేక చర్యలు చేపట్టారు. లైసెన్స్ కలిగిన జాలర్లను మాత్రమే లోతట్టు ప్రాంతాల్లో అనుమతించారు. దీంతో పాటు ప్రత్యేక మరబోటు ద్వారా జలాశయ లోతట్టు ప్రాంతంలో గస్తీని సైతం నిర్వహించారు. గ్రామంలో అలివి వలలతో వేట సాగిస్తున్న వారిని పోలీసులు బైండోవర్ చేసి కేసులు నమోదు చేశారు. దీంతో అలివి వలలతో చేపల వేట పూర్తిగా నిషేధంలో ఉండింది. అయితే ప్రస్తుతం జలాశయంలో మత్స్య శాఖ పర్యవేక్షణ కొరవడింది.

పటిష్ట చర్యలు చేపడతాం

నిషేధిత అలివి వలలతో చేపల వేటను పూర్తిగా అరికట్టేందుకు వైఎస్సార్, అన్నమయ్య జిల్లాల అధికారులు.. మేము సమన్వయంతో పటిష్ట చర్యలు చేపడతాం. స్థానిక పోలీసులకు సంబంధిత ఉత్తర్వులు అందజేశాం. గ్రామంలో అలివి వలలతో చేపల వేట సాగిస్తున్న వారిపై చట్టపరమైన చర్యలకు సన్నద్ధమవుతున్నాం.
– నాగేశ్వరరావు, జేడీ, మత్స్యశాఖ

అధునాతన వసతులతో నుడా పార్కు అభివృద్ధి



పార్కును పరిశీలిస్తున్న కొండ్రెడ్డి రంగారెడ్డి, ముక్కాల ద్వారకానాథ్

నెల్లూరు(బారకాసు): నగరంలోని అన్నమయ్య సర్కిల్ వద్ద గల నుడా పార్కును అధునాతన వసతులతో ఆహ్లాదకరంగా తీర్చిదిద్దుతున్నామని విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, నుడా చైర్మన్ ముక్కాల ద్వారకానాథ్ పేర్కొన్నారు. పార్కులో జరుగుతున్న అభివృద్ధి పనులను వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలతో కలిసి గురువారం పరిశీలించిన అనంతరం వారు మాట్లాడారు. పార్కుల అభివృద్ధిని గత ప్రభుత్వం విస్మరించిందని ఆరోపించారు. నగర ప్రజలకు ఆహ్లాదకర వాతావరణాన్ని అందించాలనే లక్ష్యంతో నగరంలోని అనేక పార్కులను ప్రభుత్వం అభివృద్ధి చేసిందని తెలిపారు. ఈ పార్కులో అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేసి ఎంపీ, పార్టీ నెల్లూరు రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త ఆదాల ప్రభాకర్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభిస్తామని వివరించారు. పార్టీ బీసీ సెల్ జాయింట్ సెక్రటరీ హరిబాబుయాదవ్, జిల్లా ప్రధాన కార్యదర్శి వేలూరు శివ, సునీల్‌రెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ ఏసునాయుడు, పార్టీ నగరాధ్యక్షుడు సన్నపురెడ్డి పెంచలరెడ్డి, ఉపాధ్యక్షుడు వేలూరు శ్రీధర్‌రెడ్డి, నాయకులు శివారెడ్డి, రవి, చంద్రమోహన్‌రెడ్డి, పవన్‌కుమార్‌రెడ్డి, సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

నేడు డీవార్మింగ్ డే

- ఆల్బెండజోల్ మాత్రల పంపిణీకి చర్యలు
- ఏర్పాట్లు చేసిన యంత్రాంగం

నెల్లూరు(దర్గామిట్ట): జిల్లా వ్యాప్తంగా శుక్రవారం జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవాన్ని నిర్వహించేందుకు జిల్లా వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తయ్యాయి. దీనికి సంబంధించి కలెక్టర్ ఎం.హరినారాయణన్ అధికారులకు ప్రత్యేకంగా దిశా నిర్దేశం చేశారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆల్బెండజోల్ మాత్రలను విద్యార్థులకు అందిస్తారు. సుమారు ఏడు వేల కేంద్రాల్లో ఈ మాత్రల పంపిణీ జరుగుతుంది. పిల్లల ఆరోగ్యంపై నులిపురుగులు తీవ్ర ప్రభావాన్ని చూపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో 1 – 19 సంవత్సరాల మధ్య వయసు వారి చేత మాత్రలు మింగిస్తారు. ఒకటి నుంచి రెండేళ్ల లోపు చిన్నారులకు సగం, 2 – 19 మధ్య వయసు వారికి ఒక మాత్ర ఇస్తారు. మధ్యాహ్నం భోజనం చేసిన తర్వాత వేసుకోవాలి.

తప్పనిసరిగా ఇవ్వాలి



చిన్నారులకు ఆల్బెండజోల్ మాత్రను తప్పనిసరిగా ఇవ్వాలి. మాత్రలు వేసుకోని వారిని గుర్తించి ఈనెల 16వ తేదీన మరోసారి అందించాలి. రెండేళ్లలోపు చిన్నారులకు వారి ఇంటి వద్దే ఇచ్చేలా అంగన్‌వాడీ కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు చర్యలు తీసుకోవాలి. జిల్లాలో ఈ కార్యక్రమం విజయవంతం చేసేందుకు అందరూ సహకరించాలి.
– హరినారాయణన్, కలెక్టర్

స్కూల్ స్టోర్ రూమ్‌లో అగ్ని ప్రమాదం

కలువాయి: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలోని స్టోర్ రూమ్‌లో బుధవారం రాత్రి జరిగిన అగ్ని ప్రమాదంలో నాడు – నేడు పనులకు సంబంధించిన రూ.2 లక్షల విలువైన ఎలక్ట్రికల్ సామగ్రి దగ్ధమైంది. షార్ట్ సర్క్యూట్ వల్లే ప్రమాదం జరిగినట్లు భావిస్తున్నారు. మంటలను అదుపు చేసి రూ.10 లక్షల విలువైన తలుపులు, ఇతర వస్తువులను కాపాడగలిగారు. హెచ్‌ఎం అబ్బాస్ అలీ గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై అయ్యప్ప ఘటనా స్థలాన్ని పరిశీలించారు.

పొగాకును అనధికారికంగా విక్రయిస్తే చర్యలు


వేలం కేంద్రం పరిసరాలను పరిశీలిస్తున్న బోర్డు కార్యదర్శి వేణుగోపాల్, అధికారులు

కందుకూరు: పొగాకును బయట అమ్మడం, కొనడం రెండూ నేరమేనని, ఇటువంటి అనధికారిక విక్రయాలపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని బోర్డు కార్యదర్శి దివి వేణుగోపాల్ హెచ్చరించారు. పామూరు రోడ్డులోని రెండో వేలం కేంద్రాన్ని గురువారం ఆయన సందర్శించారు. బోర్డు పరిధిలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను పరిశీలిచారు. అనంతరం సిబ్బందితో సమావేశం నిర్వహించి పలు సూచనలిచ్చారు. సిబ్బంది రైతులకు అందుబాటులో ఉండాలని, ఎప్పటికప్పుడు నూతన సాంకేతిక పద్ధతులను వారికి పరిచయం చేయాలని సూచించారు. పక్వానికి వచ్చిన ఆకులను మాత్రమే రెల్చాలని, అల్లిన కర్రలను బ్యారన్‌లో మోతాదుకు మించి పెట్టవద్దని చెప్పారు. క్యూరో మీటర్‌ను తప్పనిసరిగా వాడాలని దీని వల్ల అగ్ని ప్రమాదాలను నివారించేందుకు అవకాశం ఉంటుందని వివరించారు. గొట్టాలపై ఇనుప జాలీలను వాడాలని, గ్రేడ్ చేసే సమయంలో పొగాకేతర అన్య పదార్థాలను ఏరివేయాలని, బేళ్లు కట్టే సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రైతులు పొగాకు వేలం కేంద్రం బయట అమ్మడం, కొనడం చట్టరీత్యా నేరమని వివరించారు. కార్యక్రమంలో ఆర్‌ఎం ఎం. లక్ష్మణరావు, వేలం నిర్వహణాధికారి రాజగోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్)	140
లేయర్ (లైవ్)	85
బ్రాయిలర్ చికెన్	248
బ్రాయిలర్ స్కిన్‌లెస్	274
లేయర్ చికెన్	145



వృద్ధురాలి దారుణ హత్య

- నగదు కోసం ఘాతుకం
- దర్యాప్తు చేస్తున్న పోలీసులు

యర్రగొండపాలెం: వృద్ధురాలిని దారుణంగా హత్య చేసి మృతదేహాన్ని ఈడ్చుకెళ్లి పడేసిన ఘటన మండలంలోని రాళ్లవాగు సమీపంలో గురువారం వెలుగు చూసింది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.. స్థానిక అంబేడ్కర్ నగర్‌కు చెందిన తూమాటి చెన్నమ్మ (77) బుధవారం కాలనీ సమీపంలో సమాధుల వద్దకు బహిర్భూమికి వెళ్లింది. అక్కడి నుంచి ఆమె తిరిగి ఇంటికి చేరుకోలేదు. ఆచూకీ కోసం బంధువులు తీవ్రంగా గాలించినా కనిపించలేదు. గురువారం ఉదయం కూడా వారు గాలిస్తున్న సమయంలో ఓవర్‌హెడ్ ట్యాంకు పక్కన ఉన్న పిచ్చి మొక్కల పొదల్లో చెన్నమ్మ మృతదేహాన్ని గుర్తించారు. వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు విచ్చేసి ఘటనా స్థలంలో ఆమెను ఈడ్చుకొని వెళ్లిన ఆనవాళ్లను గుర్తించారు. చెన్నమ్మ వద్ద ప్రస్తుతం రూ.5 వేలు ఉన్నట్లు కుమారుడు వెంకటేశ్వర్లు తెలిపారు. దీంతో నగదు కోసం హత్య చేసి ఉండొచ్చని చెబుతున్నారు. ఆ ప్రాంతంలో జన సంచారం తక్కువగా ఉంటుందని, గుర్తు తెలియని వ్యక్తులు నీళ్ల ట్యాంకు వద్ద మద్యం తాగుతున్న సమయంలో వృద్ధురాలు వెళ్లగా డబ్బు కోసం తలపై రాళ్లతో కొట్టి హత్య చేసి ఉండొచ్చని అనుమానిస్తున్నారు. మార్కాపురం డీఎస్పీ జి.వీరరాఘవరెడ్డి తన సిబ్బందితో కలిసి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. వెంటనే క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్‌ను రప్పించి దర్యాప్తును ముమ్మరం చేశారు. డాగ్ స్క్వాడ్ అంబేడ్కర్ నగర్, మెయిన్ రోడ్డులో ఎక్కువగా తిరిగింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. డీఎస్పీ వెంట ట్రైనీ డీఎస్పీ షెహవాజ్ అహ్మద్, యర్రగొండపాలెం, మార్కాపురం సీఐలు కె.రాములునాయక్, ఆవుల వెంకటేశ్వర్లు, సర్కిల్ పరిధిలోని ఎస్సైలు బి.సుదర్శన్, అంకమరావు, ఫాతిమా బేగం, క్లూస్ టీం ఏఎస్సై మహమ్మద్ ఇబ్రహీం ఉన్నారు.


చెన్నమ్మ (ఫైల్)

బదిలీ అధికారులకు పోస్టింగ్‌లు

నెల్లూరు(దర్గామిట్ట): సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో వివిధ జిల్లాల నుంచి జిల్లాకు వచ్చిన తహసీల్దార్లు, డీటీలు, రీసర్వే డీటీలకు పోస్టింగ్‌లు ఇస్తూ కలెక్టర్ ఎం.హరినారాయణన్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. తహసీల్దార్లకు సంబంధించి కలువాయికి సంజీవకుమారి, కలెక్టరేట్ భూసేకరణ విభాగానికి జి.శ్రీధర్‌బాబు, విడవలూరుకు సీహెచ్ శ్రీనివాసరావు, కందుకూరుకు డి.పద్మనాభుడు, కలెక్టరేట్ ల్యాండ్ విషయాలకు జె.ప్రసాదరావు, ఇందుకూరుపేటకు జి.రమేష్‌కుమార్, కొండాపురానికి టి.మస్తాన్, దుత్తలూరుకు ఆర్.యశోధ, కందుకూరు సబ్ కలెక్టర్ డీఏఓగా కె.అరుణాదేవి, బోగోలుకు ఎస్.వెంకటరత్నం, కలెక్టరేట్ కేఆర్‌ఆర్‌సీకి ఎం.క్షేమరాణి, షేక్ ఇస్మాయిల్‌ను నియమించారు. డిప్యూటీ తహసీల్దార్లకు సంబంధించి గుడ్లూరుకు ఆర్‌వీ ప్రసాద్, ఆత్మకూరు ఆర్డీఓ కార్యాలయ ఎస్‌డీటీగా వై.అశోక్‌కుమార్, నెల్లూరు రూరల్ ఎన్నికల విభాగానికి జి.రవికుమార్, నెల్లూరు డీఎం సివిల్ సప్లైస్ పెట్రోల్ బంకుల విభాగానికి ఎం.లక్ష్మీచైతన్యమ్మ, రాపూరు ఎస్‌డీసీ స్పెషల్ డీటీగా షేక్ అబ్దుల్ ఖాదర్, టీజీపీ స్పెషల్ కలెక్టరేట్‌కు షేక్ సాబీరా, బుచ్చి సీఎస్ డీటీగా జి.మల్లికార్జున, పొదలకూరు సీఎస్ డీటీగా బి.భాగ్యలక్ష్మి, మనుబోలుకు ఎస్.శ్రీకాంత్‌రెడ్డి, నెల్లూరు ఏడీ లోకలైజేషన్ స్పెషల్ డీటీగా పి.వెంకట ప్రవీణ్‌కుమార్, ఆత్మకూరు సీఎస్ డీటీగా ఎండీ అజీజుల్లాఖాన్, నెల్లూరు కలెక్టరేట్‌కు కేసీ ఆషార్, బి.ప్రవీణకుమారి, అనంతసాగరానికి ఎం.గిరీషా, నెల్లూరు చెక్‌పోస్టుకు ఎం.హజరత్‌బాబు, ఏపీ ట్రాన్స్‌కోకు ఎస్.స్వర్ణలత, నెల్లూరు అర్బన్ సీఎస్ డీటీగా వై.నాగేశ్వరరావు నియమితులయ్యారు. రీసర్వే విభాగానికి సంబంధించి విడవలూరుకు కె.విజయకుమార్, కలువాయికి డి.మంజులాదేవి, సీతారామపురానికి సీహెచ్ ప్రసూన, నెల్లూరు రూరల్‌కు ఎండీ ఖమ్రున్నీసా, నెల్లూరు అర్బన్‌కు ఎ.అశోక్‌వర్ధన్, చేజర్లకు వై.ప్రభాకర్‌రావు, కోవూరుకు జి.సతీష్‌కుమార్, బోగోలుకు ఎస్.మాధవి, పొదలకూరుకు ఎస్.శ్రీసాయి గణేష్‌బాబు, సైదాపురానికి సీహెచ్ శ్యామ్, దుత్తలూరుకు ఎం.సాయిప్రియాంక, ఉదయగిరికి షేక్ జహీర్‌బాబు, అల్లూరుకు ఎ.గీత, ఆత్మకూరుకు ఎస్.వెంకటేష్, ఇందుకూరుపేటకు బి.మధుసూదన్‌రావు, దగదర్తికి బీహెచ్ సుభద్రను నియమించారు.

గిఫ్ట్ కొనేందుకు డబ్బు ఇవ్వలేదని..

- భర్తపై అలిగి భార్య ఆత్మహత్య

నెల్లూరు(క్రైమ్): భర్తపై అలిగి వివాహిత ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన నెల్లూరు రాయాజి వీధిలో గురువారం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. రాయాజీవీధికి చెందిన టి.కుమారి (42), శ్రీహరి దంపతులకు ఇద్దరు సంతానం ఉన్నారు. వారు తమ ఇంటికి సమీపంలోనే ప్రింటింగ్ ప్రెస్ నిర్వహిస్తున్నారు. కుమారి తమ్ముడు మహేష్ మనుమసిద్ధినగర్‌లో ఇల్లు కట్టించారు. గృహ ప్రవేశానికి అక్క, బావను పిలిచారు. ఈ నేపథ్యంలో గురువారం మహేష్‌కు దుస్తులు, గిఫ్ట్ తెచ్చేందుకు డబ్బు ఇవ్వాలని కుమారి భర్తను కోరగా ఆయన లేవని చెప్పాడు. తనవారికి ఇచ్చేందుకు ఎప్పుడూ డబ్బులు ఉండవని ఆమె మనస్తాపానికి గురై ఇంట్లోని ఫ్యాన్‌కు చీరతో ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడింది.

ఈ మేరకు బాధిత కుటుంబ సభ్యులు చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇన్‌స్పెక్టర్ బి.అశోక్‌కుమార్, ఎస్సై సైదులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. వివరాలు తెలుసుకుని మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

హత్యాయత్నం కేసులో నిందితుల అరెస్ట్

నెల్లూరు(క్రైమ్): పాతకక్షల నేపథ్యంలో ఓ వ్యక్తిపై హత్యాయత్నం చేసిన ఘటనలో ఐదుగురు నిందితులను నెల్లూరు చిన్నబజారు పోలీసులు గురువారం అరెస్ట్ చేశారు. వారి కథనం మేరకు.. పరమేశ్వరినగర్‌కు చెందిన జాకీర్, జెండా వీధికి చెందిన ముజామిల్ బాడీబిల్డర్లు. నాలుగు సంవత్సరాల క్రితం జిమ్‌లో వారి మధ్య ఘర్షణ జరిగింది. ఇరువురూ దాడులు చేసుకున్నారు. అప్పటి నుంచి ముజామిల్ జాకీర్‌పై కక్ష పెంచుకున్నాడు. ఈ నెల 4వ తేదీన అర్ధరాత్రి జాకీర్ తన అల్లుడితో కలిసి మోటార్‌బైక్‌పై ఇంటికి వెళ్తుండగా మెక్లిన్స్‌రోడ్డు వద్ద ముజామిల్ తన స్నేహితులైన నారాయణ, విష్ణు, సుబ్రహ్మణ్యం, రియాజ్‌లతో కలిసి అడ్డుకున్నాడు. అనంతరం జాకీర్‌పై వారు కత్తులతో దాడిచేసి పరారయ్యారు. చిన్నబజారు పోలీసులు ముజామిల్, అతని స్నేహితులపై హత్యాయత్నం కేసు నమోదు చేసి గాలింపు చర్యలు చేపట్టారు. గురువారం ఇన్‌స్పెక్టర్ అశోక్‌కుమార్ ఆర్టీసీ బస్టాండ్ వద్ద నిందితులను అరెస్ట్ చేశారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

పొదలకూరు: ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన నిమ్మ మార్కెట్ యార్డు వ్యాపారి ఖాదర్‌బాషా (60) ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. పోలీసుల కథనం మేరకు.. ఖాదర్‌బాషా కొన్నేళ్లుగా యార్డులో వ్యాపారం చేస్తున్నాడు. ఆయన గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడు. దీనికితోడు వ్యాపారంలో నష్టాలు రావడంతో మనస్తాపానికి గురై బుధవారం రాత్రి ఇంట్లో హార్పిక్ తాగాడు. కుటుంబ సభ్యులు గుర్తించి చికిత్స నిమిత్తం నెల్లూరుకు తరలించారు. అక్కడ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ చనిపోగా సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నిమ్మ ధరలు (కిలో)

పెద్దవి	రూ.63
సన్నవి	రూ.50
పండ్లు	రూ.25



పోలింగ్ కేంద్రాల పరిశీలన



సైదాపురం: తహసీల్దార్ టి.ప్రవీణ్ కుమార్ గురువారం రామసాగరం, సైదాపురం, చాగణం, మర్లపూడి, కొమ్మిపాడు గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. వాటిల్లో మౌలిక వసతులు ఉండేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

- రాపూరు: మండలంలో 52 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ వెంకటస్వామి తెలిపారు. ఆయన గురువారం రాపూరు, సిద్ధవరం పంచాయతీలు, రావిగుంటపల్లి తదితర ప్రాంతాల్లోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఆర్‌ఐ సతీష్, హౌసింగ్ ఏఈ రామకృష్ణ, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.